52

# సూది నేర్పిన పాఠం

పంచనద దేశంలో ధనసింహుడనే వ్యాపారి వుండేవాడు.

అతడు పేదసాదలను ఎంతో పీడించి లక్షలు గడించాడు. అష్ట ఐశ్వర్యాలున్నా సంతానం లేకపోవడం వల్ల అతడికి ఎంతో దిగులుగా వుండేది. భార్యాభర్తలు ఇద్దరూ ఎన్నో పూజలు చేశారు. సాధు సన్యాసులను ఆశ్రయించారు. అయినా ఫలితం లేకపోయింది. తాను సంపాదించిన అంతటి ఆస్తి చివరకు పరాయివాళ్ళకు పోతుందేమోనన్న భయం, దిగులూ ధనసింహుడిని నిత్యమూ పీడిస్తుండేవి.

ఒకసారి సిక్కుమత స్థాపకుడైన గురునానక్ దేశ సంచారం చేస్తూ ఆ ఊరికి వచ్చాడు.

నానక్ గొప్పతనం మహిమలు బాగా విన్న ధనసింహుడుకి ఆయన ఆశీర్వాదాలవల్ల సంతానం కలగవచ్చన్న ఆశ కలిగింది. వెంటనే భార్యకి ఆ విషయం చెప్పి ఆమెతో సహా నానక్‌కి ఎదురేగాడు. ఆయన ముందు సాష్టాంగపడి తన ఇంటికి వచ్చి పావనం చేయవలసిందిగా పదే పదే ప్రాధేయపడ్డాడు.

ధనసింహుడి మాట కాదనలేక గురునానక్ తన శిష్యులతో అతడి ఇంటికి వచ్చాడు.

తన ఇంటిలో శ్రీ నానక్‌కి ఘనంగా సేవలు, శుశ్రూషలూ చేసి చివరికి తనకి సంతానం కలిగేటట్లు అనుగ్రహించమని కోరాడు.

నానక్ చిరునవ్వు నవ్వి, "ధనసింహా! సంతానం అనేది అష్ట ఐశ్వర్యాలలో ఒకటి. మనం చేసే సత్కర్మల వల్ల అది సిద్ధిస్తుంది. నీకు సంతానం లేదన్న దిగులెందుకు? పేదసాదలను నీ కన్నబిడ్డలుగా భావించు" అన్నాడు.

"అలా కాదు స్వామీ. నేను ఇంతగా సంపాదించిన ఆస్తి ఎవరికో ఎలా ఇవ్వను?! తమరు అనుగ్రహిస్తే నాకు సంతానం తప్పక కలుగుతుంది" అంటూ బలవంతం చేయసాగాడు.



చివరికి నానక్ –“ ధనసింహా! నేను ఇప్పుడు యాత్రలలో వున్నాను. మరో నాలుగు మాసాలలో తిరిగి ఇటే వస్తాను. అప్పుడు నీ కోరిక నెరవేరేటట్లు చూస్తాను” అన్నాడు నానక్.

“స్వామీ! నా ఈ చిన్న కానుకలు స్వీకరించండి” అంటూ ధన కనక వస్తువులను ఇయ్యబోయాడు ధనసింహుడు.

“సర్వసంగ పరిత్యాగిని. నాకు ఇవి ఎందుకు నాయనా?” అన్నాడు నానక్.

“తమరు తప్పక స్వీకరించాలి” అని బలవంతపెట్టాడు ధనసింహుడు.

“సరే! వీటిని నీ దగ్గరే వుంచు! తిరిగి వచ్చేటప్పుడు తీసుకు వెడతాను. నేను నీకో సూదిని ఇస్తాను. దానిని భద్రంగా దాచాలి సుమా! అది నాకు ఎంతో విలువైనది. నా యాత్రలో ఎక్కడైనా పోతుందేమోనన్న భయంతో నీకు ఇస్తున్నాను.., నేను తిరిగి వచ్చాక నాకు మళ్ళీ ఇద్దువు గాని!” అన్నాడు నానక్.

“చిత్తం స్వామీ! మహాప్రసాదం. ఆ సూదిని నా ప్రాణ సమానంగా కాపాడతాను” అన్నాడు ధనసింహుడు ఆ సూదిని తీసుకుంటూ. నానక్ శిష్యులతో సహా మరో ప్రదేశానికి వెళ్ళిపోయాడు.

మూడు నెలలు గడిచాయి.

ఒక రోజున ధనసింహుడి దగ్గరకు ఒక సన్యాసి వచ్చాడు.

మాటలను బట్టి అతడు నానక్ శిష్యుడని వెంటనే గుర్తు పట్టాడు ధనసింహుడు. అతడికి భక్తితో నమస్కరించి కుశలం అడిగాడు.

ఆ సన్యాసి "ధనసింహా! మా గురువుగారు నీ వద్ద ఒక సూదిని దాచారు. దానిని తీసుకుని ఆయన దగ్గరకు రమ్మన్నారు" అన్నాడు.

"అలాగా! అంతకంటేనా? వారు ఎక్కడ వున్నారు?" అన్నాడు ధనసింహుడు ఆత్రంతో.

"ఏమి చెప్పను? వారు యాత్రలు చేస్తూనే కురుక్షేత్రంలో అకాల మరణం పొందారు. పోయే ముందు నాకు ఈ విషయం చెప్పారు" అన్నాడు సన్యాసి గాద్గదికంగా.

"అయ్యో... ఎంతపని అయ్యింది? చనిపోయిన వారికి నేను ఎలా సూదిని ఇవ్వను?" అన్నాడు ధనసింహుడు విచారంగా.

"పోనీ.., నీవు చనిపోయినప్పుడు నీ వెంట తీసుకొని వెళ్లి ఇయ్యి. ఇది కూడా మా గురువుగారే చెప్పారు" అన్నాడు ఆ సన్యాసి మళ్ళీ.

"ఇది మరీ బాగుంది. చనిపోయిన వాడు వెంట ఏమైనా తీసుకువెళ్లగలడా?" అన్నాడు ధనసింహుడు కొంచెం విచారంగా.

"వెంట సూదిని కూడా తీసుకుపోలేని వాడివి – ఎందరి నోళ్ళో కొట్టి సంపాదించిన ఈ ఆస్తిని ఏమి చేసుకొంటావు?" అన్నాడు ఆ సన్యాసి సూటిగా చూస్తూ.

మాటలతో ధనసింహుడికి జ్ఞానోదయం అయింది.

తనకి బుద్ధి చెప్పడానికే గురునానక్ ఈ విధంగా చేశాడని గ్రహించాడు. పశ్చాత్తాపంతో నానక్‌ని స్మరించుకొంటూ మనసులోనే అంజలి ఘటించాడు.

అంతలో... గురునానక్ మిగిలిన శిష్యులతో అక్కడికి వచ్చాడు. ఆయన కాళ్ళమీద పడి కన్నీటితో పాదాభిషేకం చేశాడు ధనసింహుడు.

"స్వామీ! నాకు మంచి గుణపాఠం నేర్పారు. ధనం మీద వ్యామోహం పోయింది. నా ఆస్తినంతటినీ పేదసాదలకు పంచి పెట్టి మీ వెంటనే వస్తాను. నన్ను మీ శిష్యకోటిలో జేర్చుకోండి" అని ప్రాధేయపడ్డాడు.

"సక్రమమైన మార్గంలో సంపాదించు. నీ అవసరాలకు వుంచుకొని మిగిలినది పేదసాదలకోసం వెచ్చించు. అందర్నీ నీ కుటుంబంలోనివారుగా భావించి ప్రేమించు. ఆ విధంగా చేస్తే భగవంతుడు నిన్ను తప్పక కరుణిస్తాడు. కేవలం సన్యాసులలో కలిస్తేనే మోక్షం వస్తుందనుకోవడం పొరపాటు. నీ విధిని నీవు సరిగా నిర్వర్తించు" అని బోధించి వెళ్లిపోయాడు నానక్.

గురునానక్ చూపిన బాటలో పయనించి ఏ దిగులూ లేకుండా తన శేషజీవితాన్ని హాయిగా గడిపాడు ధనసింహుడు.

★★★